దాతలూ స్పందించండి..

- హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బోధన
- అల్పాహారంతో కోసం ఎదురుచూపు
- దాతలు, స్వచ్ఛంద సంస్థలు స్పందించాలని వినతి



పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సాధనలో పదో తరగతి విద్యార్థులు

పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. పాఠశాలకు ఉదయం 7 గంటలకు వెళ్లి సాయంత్రం 7 గంటలకు ఇంటికి వస్తున్నారు. ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్, వారాంత పరీక్షలతో బిజీగా ఉన్నారు. ఉత్తమ ఉత్తీర్ణతకు కష్టపడి చదువుతున్నారు. ఉదయం ఇంటి వద్ద అల్పాహారం, మధ్యాహ్నం పాఠశాలలో భోజనం తీసుకుంటున్నారు. ఇది బాగానే ఉన్నా సాయంత్రం స్నాక్స్ లేక ఇబ్బంది పడుతున్నారు. రోజంతా చదువుతూ అలసిపోతున్నారు. దాతలు స్పందించి వారికి అల్పాహారం అందిస్తే మరింత ఉత్సాహంతో చదువుతారు. వారి జీవితానికి బాటలు వేసిన వారవుతారు.

నిడదవోలు: విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభంకానున్నాయి. విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు పునశ్చరణ తరగతులు, ప్రత్యేక బోధన, అనుమానాలను నివృత్తి కోసం ప్రతి స్కూల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు రోజువారీ స్లిప్ టెస్టులు, వారంతపు పరీక్షలను ఆయా సబ్జెక్టుల వారీగా నిపుణులు తయారు చేసిన నమూనా పరీక్షలను ప్రతిరోజు నిర్వహిస్తూ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేవారిలో అధిక శాతం నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. వీరు ఆ పాఠశాల సమీప గ్రామాల నుంచి రెండు నుంచి ఆరు కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తుంటారు. వీరు ఉదయం 7 గంటలకే ఇళ్ల వద్ద బయలుదేరి 8 గంటలకు ప్రారంభించే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. అదేవిధంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం పథకంలో భోజనం చేసి మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక స్టడీ అవర్స్‌లో ఉంటున్నారు. ఈ సమయంలో వారికి అల్పాహారం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక తరగతుల్లో చదువుతూ విద్యార్థులు అలసటకు గురవుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక తరగతులు ముగిసిన తర్వాత ఇళ్లకు చేరడానికి రాత్రి 6:30 గంటల నుంచి 7 గంటలవుతోంది. దీంతో వీరు నిరశించిపోతున్నారు. సాయంత్రం వేళలో వీరికి అల్పాహారం ఏర్పాట్లు ఉంటే విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. అల్పాహారం తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో తరగతులకు ఉత్సాహంగా హాజరవుతారు. గతంలో జిల్లా పరిషత్ వారు పదో తరగతి విద్యార్థులకు కొన్నాళ్లు అల్పాహారం అందించింది. ఆయా పాఠశాలకు ఉపాధ్యాయులు గ్రామంలోని కొందరు దాతలు సహకారంతో ప్రతిరోజు పులిహోర, వెజ్ బిర్యాని, ఉడకబెట్టిన సెనగలు, పలావు, బజ్జీ, సమోసా గారే, మసాలా వడలు వంటి ఆహారాన్ని విద్యార్థులకు అందించేవారు. ప్రస్తుతం ఈ విధానం ఎక్కడా కలనిపించడం లేదు.

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు		
మండలం	హైస్కూళ్లు	విద్యార్థులు
నిడదవోలు	12	721
ఉండ్రాజవరం	08	467
పెరవలి	07	454
మొత్తం	27	1,642



పట్టణంలో డొక్కా సీతమ్మ మున్సిపల్ హైస్కూల్లో అల్పాహారం తింటున్న విద్యార్థులు

దాతలు సాయం అందిస్తే..

నిడదవోలు నియోజకవర్గంలో నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, ఎందరో దాతలు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ప్రధానంగా పట్టణంలోని డొక్కా సీతమ్మ మున్సిపల్ హైస్కూల్, ఎల్ఎల్ఆర్ మున్సిపల్ హైస్కూల్, నంబర్ 3 మున్సిపల్ హైస్కూల్లో లయన్స్‌క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందిస్తున్నారు. పట్టణంలో ఉన్న నిడదవోలు రోటరీ క్లబ్, నిడదవోలు సెంట్రల్ రోటరీ క్లబ్, వాసవీ క్లబ్, వాసవి వనిత క్లబ్‌లు వివిధ సామాజిక కార్యక్రమాలు చేయపడుతున్నారు. ఆయా క్లబ్‌ల సభ్యులు స్పందించి అల్పాహారం అందించాలని పదో తరగతి విద్యార్థులు కోరుతున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా వంద రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేస్తున్నారు. దీంతో కొన్నాళ్లుగా పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ఒక్కో గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థుల ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఏకధాటిగా పాఠశాలలోనే ఉంటున్నారు. ఈ సమయంలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు అల్పాహారం కోసం అల్లాడుతున్నారు. అర్ధాకలితోనే చదువుని కొనసాగిస్తూనే ఉన్నారు.

దాతల సహకారం అవసరం



పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహణతో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పాఠశాలల్లోనే ఉండిపోతున్నారు. దీంతో వారు అలసిపోతున్నారు. వీరికి అల్పాహారం అందించడానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరుతున్నాం. దాతలు స్పందించి ముందుకు వచ్చి అల్పాహారం ఇస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో చేపడితే విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది.

– కేఎస్‌వీ గణేష్, ఎంఈవో, నిడదవోలు

క్లుప్తంగా

వాట్సాప్‌లో టికెట్ బుకింగ్ సేవలు నిడదవోలు

నిడదవోలు : ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం వాట్సాప్‌లో టికెట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందని నిడదవోలు ఆర్టీసీ డీఎం కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 95523 00009 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని పంపిస్తే ఆర్టీసీలో అందుబాటులో ఉన్న సేవలు కనిపిస్తాయి. అందులో బుకింగ్, రద్దు అనే ఆప్షన్‌ను ఎంపిక చేసి ప్రమాణికుల ప్రయాణ ప్రదేశం, గమ్య స్థానం, తేదీ టైప్ చేస్తే అందుబాటులో ఉన్న బస్సుల్లో సీట్లు వివరాలను పొందవచ్చునన్నారు. ఎంపిక చేసిన తర్వాత బస్ చార్జీని డిజిటల్ మనీ చెల్లింపు చేస్తే ప్రయాణికుడి వాట్సాప్‌కు బస్ టికెట్ వస్తుందని ఆయన పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయికి విద్యార్థుల ఎంపిక

నల్లజర్ల: విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో దూబచర్ల సంఘమిత్ర విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనపర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆ స్కూలు డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు.ఈ పోటీల్లో యడ్లపల్లి మౌనిక (2వతరగతి)తాళ్ళ సుశాంత్(6వతరగతి) ఉత్తమ ప్రతిభకనపర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, 9వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. శనివారం స్కూలులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

హెల్త్ కార్డుపై నగదు రహిత వైద్యం అందించాలి

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయించే వైద్యఖర్చుల మొత్తాన్ని పెంచి హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని పెన్షనర్ల మండల శాఖ అధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. నల్లజర్లలో శనివారం పెన్షనర్ల సమావేశం జరిగింది. పెండింగ్ సమస్యలు పరిష్కారించాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు ఎస్.ఎం.ఆలీసాహెబ్, ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరావు, ప్రభుదాసు, బాలయ్య, అప్పారావు, దత్తు, ప్రతాప్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రజకులకు కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తాం



రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను సత్కరిస్తున్న రజకులు

నిడదవోలు : రజకుల సొసైటీకి నెలరోజుల్లో కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హామి ఇచ్చారు. పట్టణంలో శనివారం రజకుల బల్లల పండుగ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రజక సోదరులు ఎన్నికల సమయంలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని ఇచ్చిన హామిని నెరవేరుస్తామన్నారు. అనంతరం మంత్రి దేర్గేష్‌ను రజకలు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ల కారింకి నాగేశ్వరరావు, మానుపాటి లక్ష్మీ, కూటమి నాయకులు రంగా రమేష్, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, తిరుపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయంతో ఢిల్లీ అభివృద్ధికి బాటలు

కొవ్వూరు: దేశ రాజధాని ఢిల్లీ రాష్ట్రంలో సాధారణ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం హర్షణీయమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పేర్కొన్నారు. ఢిల్లీ ఓటర్లు దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బీజేపీకి పట్టం కట్టారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీ రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధికి ప్రజలు బాటలు వేశారన్నారు.

బీజేపీ విజయోత్సవాలు



పట్టణంలో మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు

నిడదవోలు : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై పార్టీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల బాలాజీ వెంకటేశ్వరరావు, మోర్త సాయికుమార్, ముదునూరి కిషోర్‌రాజా, బండి సత్యనారాయణ, నీలం రామారావు, తోరం జై శ్రీనివాస్, పినిశెట్టి చంద్రబాబు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఉండ్రాజవరం : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులందరూ అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు శనివారం తెలిపారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఈ రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్టు తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలు పొందడంతో పాటు ఇతర ప్రభుత్వ సేవలు అందుకునేందుకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పనిసరన్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు ఈ రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, ఆధార్‌కార్డ్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్ వెంట తీసుకుని రావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కొవ్వూరు: పట్టణ శివారున ఆరికిరేవుల వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌కి సమీపంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న పొన్నాడ శ్రీనును ట్రాక్టర్ వెనుక నుంచి ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ధవళేశ్వరం గ్రామానికి చెందిన శ్రీను బోటు మెకానిక్‌గా పని చేస్తున్నారు. ఈనెల 5వ తేదీన పోలవరం మండలం పట్టిసీమలో బోటు మెకానిక్ పని నిమిత్తం వెళ్లి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో ప్రమాదం బారిన పడ్డారు. తీవ్ర గాయాలపాలైన ఆయన ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఉండ్రాజవరం: గ్రామంలో సుంకవల్లి ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తణుకు సితార హాస్పటల్ నిర్వాహకులు శనివారం తెలిపారు. సితార హాస్పటల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కంటి వైద్యులు డాక్టర్ హుస్సేన్ మహమ్మద్ సేవలందించనున్నారని తెలిపారు. ఈక్యాంప్‌లో బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

మాజీ మంత్రి వనితను కలిసిన నేతలు



మాజీ మంత్రి వనితను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నియోజకవర్గ నేతలు



వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీను

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులుగా నియమితులైన నేతలు శనివారం మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జి తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ, యూత్ విభాగం అధ్యక్షులు నక్కా పండు, వివిధ విభాగాల అధ్యక్షులు బాలం వెంకటేశ్వరరావు, దప్పసాని రాధాకృష్ణ, గొర్రెల సాంబశివ నాయుడు, నందం ఉదయ బాలాజీ, మద్దూరి నాగేశ్వరరావు, పిట్ట సుకుమార్, సత్తి జగదీశ్వర రెడ్డి, తదితరులు మాజీ మంత్రి వనితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కాకులపాటి శ్రీను

గోపాలపురం: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గోపాలపురం మండలం భీమోలు గ్రామానికి చెందిన కాకులపాటి శ్రీనును ఎంపిక చేసినట్టు రాష్ట్ర మాజీ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత శనివారం ప్రకటించారు. ఆమెను కాకులపాటి శ్రీను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎస్సీలను కలుసుకుంటానని నాపై ఎంతో నమ్మకంతో నన్ను ఎంపిక చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి తానేటి వనిత, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచకర్మ సేవలు ప్రారంభం

నిడదవోలు : పట్టణంలోని గాంధీనగర్‌లో మున్సిపల్ ఆయుర్వేద వైద్యశాలలో పంచకర్మ సేవలు శనివారం ప్రారంభమయ్యాయి. లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ కొత్తపల్లి రవికుమార్ పంచకర్మ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు కె. శ్రీవిద్య, కొత్తపల్లి నాగేశ్వరరావు, గొన్నబత్తుల రామారావు, ముంగండ చిట్టిబాబు, బలగం అప్పారావు, బొజ్జ పాపారావు, పొన్న సుబ్రహ్మణ్యశర్మ, గొన్నాబత్తుల బత్తుల శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పడాల శిరిష, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాపిరాజు

నల్లజర్ల: విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. స్థానిక భాష్యం స్కూల్లో జరిగిన ఇంట్రాజోనల్ స్పోర్ట్ మీట్‌లో వివిధ క్రీడలలో పాల్గొన్న విజేతలకు శనివారం సాయంత్రం జెడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు బహుమతులు అందజేశారు. పోటీల్లో చింతలపూడి చీతాస్ ప్రథమ స్థానం సాధించగా, కైకలూరు కింగ్స్ ద్వితీయ స్థానం, నల్లజర్ల నైట్ రైడర్స్ తృతీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ జి.వై.రాజు వెల్లడించారు. జోనల్ విద్యాధికారి ఎ.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుని శాంతి కల్యాణం



దేవరపల్లిలో లక్ష్మీనారాయణ శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

దేవరపల్లి: గ్రామంలో ఉన్న షిర్డి సాయిబాబా మందిర వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మీనారాయణుని శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు తీగెల లక్ష్మీనారాయణ(రాజా) దంపతులతో అర్చకులు శాంతి కల్యాణం పంపించారు. లక్ష్మీదేవిని పెండ్లి కుమార్తెగాను, నారాయణుడిని పెండ్లి కుమారుడిగా అలంకరణ చేసి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతును నిర్వహించారు. తీగెల రాజా దంపతులు స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ నెల 4వ తేదీన ప్రారంభమైన షిర్డి సాయి బాబా మందిర 29వ వార్షికోత్సవాలు శనివారం లక్ష్మీనారాయణ శాంతి కల్యాణంతో ముగిశాయి. ఐదు రోజులు మందిరం వద్ద వివిధ హోమాలు, సాయినాథ సామూహిక వ్రతాలు, కుంకుమార్చనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బాబాను విశేషంగా అలంకరణ చేసి భక్తులు పూజలు నిర్వహించారు.

విస్తరిస్తున్న హెల్పింగ్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సేవలు



యర్నగూడెంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హెల్పింగ్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

దేవరపల్లి: హెల్పింగ్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సేవలను వివిధ ప్రాంతాలకు విస్తరించనున్నట్టు సభ్యులు తెలిపారు. సొసైటీ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం యర్నగూడెంలోని ఎస్సీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రథమ వార్షికోత్సవ క్యాలెంటర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, బాలకృష్ణ మాట్లాడుతూ స్థానిక బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్లో 2002–2003 విద్యాసంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సొసైటీగా ఏర్పడి కృష్ణా, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు జిల్లాల కలెక్టర్ల చేతుల మీదుగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్నట్టు బాలకృష్ణ తెలిపారు. ప్రజలకు తాగునీరు, విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్లు, వరద బాధితులకు సేవలు, మొక్కలు నాటే కార్యక్రమం వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. 18 అంశాలను పరిగణలోకి తీసుకుని సొసైటీ పని చేస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

లక్ష్యాలు స్పష్టంగా ఉంటే.. ఉన్నత స్థానాలు మీ సొంతం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తాతాజీ, కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి

నల్లజర్ల: విద్యార్థులంతా స్పష్టమైన లక్ష్యంతో చదువుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని, విజయాలు సాధిస్తారని వైజ్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ ఈతకోట తాతాజీ అన్నారు. ప్రకాశరావుపాలెంలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే జరిగింది. ప్రిన్సిపల్ డాక్టరు అరవిందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాతాజీ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో పలు అంశాలు చర్చించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు గర్వించే స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ జంగా సూర్యప్రకాష్, నామన రాంబాబు, అధ్యాపకులు డాక్టరు అమరావతి, డాక్టరు ఎ.ఎస్.ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రెండు మద్యం దుకాణాలకు 87 దరఖాస్తులు

నిడదవోలు: గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తులు వెల్లివెత్తాయి. చివరి రోజు శనివారం సాయంత్రం 5 గంటల వరకు రెండు మద్యం దుకాణాలకు 87 మంది దరఖాస్తు అందినట్టు నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్‌జే సతీష్‌బాబు తెలిపారు. గౌడ కులస్తుల నుంచి 48 దరఖాస్తులు, శెట్టిబలిజ కులస్తుల నుంచి 39 దరఖాస్తు వచ్చాయన్నారు. ఈ ఒక్క రోజే 64 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు ప్రభుత్వం నిర్ణయించిన దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ రుసుం రూ.2 లక్షలు డీడీలను తీసి ప్రభుత్వానికి చెల్లించారు. దీనికి రాజమండ్రి సబ్‌కలెక్టర్ ఈ నెల పదో తేదీ ఉదయం 10 గంటలకు డ్రా తీస్తారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందజేయాలి



స్కూల్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు సీనియర్ సివిల్‌జడ్జి అమర్, ఆర్డీవో రాణీ సుష్మిత

తాళ్లపూడి: గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు ఐఐటీ వంటి కోర్సుల్లో రాణించేలా ఉత్తమ విద్యను అందజేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత అన్నారు. తాళ్లపూడిలో శనివారం వైష్ణవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్షర సిద్ధి ఇంగ్లిస్ మీడియం స్కూల్‌ను ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ అమరావతి డాక్టర్ హెచ్ అమర్, కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మితల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం అతిథులను, గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకాస్ విద్యాసంస్థల సౌత్ డైరెక్టర్ కేవీ రవికాంత్, మండల ఆర్యవైస్య సంఘం, మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు, కెస్‌ఆర్‌కే శర్మ, డి.అర్జునరావు, చీర్ల సత్యనారాయణ, వివి ప్రభాకర్, పరస రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

దేవరపల్లి: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి మాస కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను, వేంకటేశ్వర స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరణ చేసి వేదికపై ఉంచి కల్యాణ తంతు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ వేడుకలను తిలకించారు.

నిడదవోలు : పట్టణంలోని బసివిరెడ్డిపేటలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి 50వ కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాలతో వేడకలను నిర్వహించారు. పట్టణ నలుమూలల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించారు.

శ్రీవారి ఆలయం కిటకిట

దేవరపల్లి: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం దేవరపల్లి మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవరపల్లిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. యర్నగూడెంలో వేంచేసి అలివేలు మంగ, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి విశేష అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం 6 గంటల నుండి ప్రారంభమైన వేలాది భక్తజనం మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తుల తాకిడి ఎక్కువగానే ఉంది. శనివారం, భీష్మ ఏకాదశి కావటంతో భక్తులు వేలాది మంది వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 8 వేల మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలిపారు.



యర్నగూడెంలో విశేష అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

ఘనంగా పూజలు

ఉండ్రాజవరం: భీష్మ ఏకాదశి సందర్భంగా తాడిపర్రు, మోర్త, వేలివెన్నుల్లో గోపాలస్వామి, ఉండ్రాజవరంలో కేశవస్వామి ఆలయాల్లో స్వామివార్లకు శనివారం భక్తులు అభిషేకాలు, పూజలు, అలంకరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం బాజాభజంత్రీలతో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గ్రామాల్లో ఊరేగుతుండగా భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా భక్తాంజనేయస్వామి ఏకాహ మహోత్సవం



ఆలయ ప్రాంగణంలో పటికబెల్లం తులాభారం తూగుతున్న యువతి

పెరవలి: నల్లాకులవారిపాలెంలో జాతీయరహదారి పక్కన వేంచేసియున్న భక్తాంజనేయస్వామి ఏకాహ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. వందలాది మంది భక్తులు రావడంతో ఆలయప్రాంగణం కిటకిటలాడింది. భీష్మ ఏకాదశి సందర్భంగా భక్తులు వందలాది మంది వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు 302మంది నిలువెత్తు పటిక బెల్లం తులాభారాన్ని తూగి స్వామి వారికి సమర్పించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ తులాభారంలో భక్తుల నుంచి 3 టన్నులు పటికబెల్లం స్వామివారికి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.